


గంటి రమాదేవి

**హైమవతి** అక్కయ్య ఉత్తరం రాసింది.

అక్కయ్యను చూసి అయిదేళ్ళయింది. కిందటి ఏడాది కొత్త ఇల్లు కట్టుకున్నప్పుడు గృహప్రవేశానికి పిలిచినా, వీలు కాక వెళ్ళలేదు. బ్రహ్మచారిగా ఉన్నప్పుడు సంవత్సరంలో రెండు మూడు సార్లు వెళ్ళేవాడిని. ఇప్పుడు మరీ అశ్రద్ధ అయిపోయింది. బావ మల్లికార్జున్ నా చిన్నప్పటి నుంచి బాగా తెలుసు. ఆయన చార్టర్డ్ ఎకౌంటెంటు. సిటీకి నాలుగు కిలోమీటర్ల దూరంలో శ్రీనిధి కాలనీలో కొత్తగా ఇల్లు కట్టుకుంటున్నప్పుడు ఒక్కసారి వచ్చి చూసి పొమ్మని, నువ్వు ఎలాగూ పి. డబ్ల్యు. డి. లో పని చేస్తున్నావు కదా—ఇల్లు ఎలా కడుతున్నారో చూసి పొమ్మని రాశాడు. పి. డబ్ల్యు. డి. లో నేను పని చేసేది గుమాస్తాగా. సివిల్ వర్క్ గురించి నాకు తెలియదు. అయినా వస్తాను అని జవాబు రాశాను. వెళ్ళలేకపోయాను. కోపం వచ్చిందీ కాబోలు—హైమవతి అక్కయ్య, మల్లికార్జున్ బావ మళ్ళీ ఉత్తరం రాయలేదు. గృహప్రవేశానికి కార్డు మాత్రం పంపి వూరు కున్నారు. ఇంటికి వెళ్ళినప్పుడు ఇంట్లో అందరు అక్క: 'ఈశ్వర్ పెళ్ళి అయిన తరవాత చాలా మారిపోయాడు' అని. నేను పెళ్ళి వల్ల మారానో, లేక ఉద్యోగ బాధ్యత వలన మారానో, లేక వయసు తెచ్చిన బద్ధకం వలన మారానో నాకే తెలియదు.

ఉత్తరం మళ్ళీ చదివాను. "తమ్ముడూ. ఈ మధ్య మీ బావ పరిస్థితి ఏమీ బాగులేదు. ఈ ఉత్తరాన్నే టెలిగ్రాంగా భావించి, ఉన్న పళాన రా" అని ఉంది.

• • • •

ఆదరా బాదరా ఒక సంచిలో నాలుగు గుడ్డలు కుక్కుకుని, ఆఫీసులో వారంరోజుల కొక సెలవు చీటి పడేసి, ఇంట్లో చేతిలో మిగిలిన ఏభై రూపాయలు ఇచ్చి రాత్రి రైలెక్కాను. రిజర్వేషను దొరక లేదు. రాత్రంతా ప్రయాణం. నిలబడి, కూర్చుని, జోగి ప్రొద్దుటకు అక్కయ్య వూరు చేరుకున్నాను. శ్రీనిధి కాలనీకి బస్సులు పడ్డాయి కొత్తగా. సలభై నిమిషా లకు ఒకటి. తొమ్మిదైంది అక్కయ్య ఇంటికి వెళ్ళే సరికి.

మెయిను రోడ్డుకు రెండు మూడు ఫర్లాంగుల లోపలికి ఉంది శ్రీనిధి కాలనీ. చాలా ఇళ్ళు పూర్తి అయ్యాయి. ఇంకా దిగువకు ప్లాట్లు చేస్తున్నారు. తాటిచెట్లు, ఈతచెట్లు కొట్టి శుభ్రం చేస్తు న్నారు. శ్రీనిధి కాలనీ కొత్తదయినా, దాన్ని ఆనుకునే 'అనంతమ్మ గూడెం అని చిన్నపల్లె ఉంది. ఆ పల్లె వాళ్ళే శ్రీనిధికాలనీ వాసులకి పాలు, కూరలు సరఫరా చేస్తుంటారని, వూరికి దూరంగా ఉన్నా ఇబ్బంది లేదని అందిట అక్క—ఇంటి కొచ్చినప్పుడు.

నేను వెళ్ళేసరికి పిల్లలు స్కూళ్ళకు తయారవు తున్నారు. ఇంటి ముందు రిక్షా ఆగి ఉంది. నన్ను చూడగానే పిల్లలు—"మామయ్య. మామయ్య" అని గంతు లేశారు. "వచ్చావా. ఇవాళ రాకపోతే ఇంకో ఉత్తరం రాదా మనుకుంటున్నాను" అంది అక్క.

బాగా చిక్కిపోయింది. నిద్ర లేనట్టు కళ్ళు చెబు తున్నాయి. కళ్ళ కింద నల్లటి చారలు. మొహం పాలిపోయి, రక్తం లేనట్టుగా ఉంది.

ఇల్లంతా చూశాను. ఇంటి ముందు మట్టి రోడ్డుమీద నల్లటి కంకర రాళ్ళు పోసి ఉన్నాయి గుట్టగా. అయిదడుగుల కాంపౌండు గోడ. గోడకు నీటి కుళాయి. ఒక పక్కన నుయ్యి. దానికి పంపు అమర్చారు. దాని పక్కన అరటిచెట్లు నాటారు. చిన్న కొబ్బరి మొక్క. దానికి కొంచెం దూరంలో మామిడి, పనస మొక్కలు. ఇంటి ఎడమ పక్క ఖాళీ స్థలం ఎవరిదో ప్లాటు. కుడి పక్క పెద్ద గోడ. పాత కోట గోడలా ఉంది. వెనక కాంపౌండు గోడ లేదు. ఇంటిలో ఆఖరి గదే సరిహద్దు. పంచీ లోపల పెట్టి ఖాళీ స్థలంలోంచి చూశాను. ఒక పెద్ద చింత చెట్టు. పెద్దఖాళీస్థలం. మొక్కలు చిందర వందరగా పెరిగాయి. అది ఎవరిదో కాని కాలనీ ప్లాటు మాత్రం కాదు. ఒక అర నిముషంలో చూడడం అయి పోయింది. ఈ ప్రదేశం చాలా ప్రశాంతంగా ఉంది. సిటీ మరీ దూరం కాదు, దగ్గరా కాదు. సిటీగోలకు దూరంగా ఉంది ఇల్లు. బావ సెలక్షన్ మీద గౌరవం ఏర్పడింది.

అక్క ఇచ్చిన నీళ్ళు తాగుతూ అడిగాను—"ఎందు కంత అర్జంటుగా రమ్మని రాశావు. అక్కా? ఏమయి ఉంటుందా బావకు అని ఒకటే మథన రైల్లో."

ఇంటికి రాగానే—'బావ కెలా ఉంది?' అని

అడగదలచుకో లేదు. ఇదేదో బావకి అక్కకు మధ్య ఉన్న బాధే. పిల్లలు మామూలుగా స్కూలు కెళ్ళడం, ఇల్లంతా మామూలుగా ఉండడం—ఇదంతా చూసి తను చెప్పేటంత వరకు అడగకూడ దనుకున్నాను.

గ్లాసు చేతిలో తీసుకుని చెప్పింది— "లోపలకు రా. నువ్వే చూద్దువు కాని."

లోపలికి నడిచాను. ఒక పడక కుర్చీలో కూర్చుని ఉన్నాడు బావ. చేతిలో ఏదో పుస్తకం ఉంది. చదువుతున్నదీ, లేనిదీ చెప్పలేను. అలా ఒకటే పేజీ కేసి చాలాసేపు చూడడాన్ని బట్టి ఆయన చదవడం లేదని అర్థమవుతూంది.

భుజం పట్టుకుని కుదిపి అక్క గట్టిగా చెప్పింది ఆయనతో—"మా తమ్ముడు వచ్చాడు. చూడండి" అని.

తెల్లటి పైజామా లాల్చీ వేసుకున్నాడు. ఆయన పడక కుర్చీలో వాలుగా కూర్చుని ఉన్నాడు. ఆయనది మంచిరంగు. నున్నగా ఒత్తుగా ఉండే జుట్టు. అక్కడక్కడ తెల్లబడుతోంది. ఎందుకో పలచబడింది కూడా.

రెండుసార్లు కుదుపగా తల ప్రక్కకి త్రిప్పి చూశాడు నాకేసి. ఆ కళ్ళు చూసి షాక్ తిన్నట్టయి పోయాను. చక్కటి పెద్ద కళ్ళు బావవి. ఇప్పుడు ఎవరో ఆ కళ్ళను తీసివేసి ఏదో చిన్న కళ్ళు తిరిగి పెట్టినట్టుగా కన్పించాయి. నల్లటి కనుగ్రుడ్లు ముదురు తేనె రంగులో ఉన్నాయి. ముఖమంతా పీక్కుపోయి ఉంది. గడ్డం పెరిగింది. తల త్రిప్పా డన్న మాటే గాని నన్ను గుర్తు పట్టినట్టుగాని, కనీసం చూసినట్టు గాని ఆ కళ్ళలో కనబడలేదు.

నా ఒళ్ళు జల్లుమంది!

"సరిగ్గా వారం అయిందిరా ... ఈ వాలకం ... అదే రోజు నుంచి ... నువ్వు అంటుంటావే నున్నటి పత్తయిన జుట్టు ... తుట్టలు తుట్టగా వూడి పోతోంది... అదిగో ఆ ప్లాస్టిక్ బకెట్‌లో పోశాను... అంది అక్కయ్య ఒక విరిగిపోయిన ప్లాస్టిక్ బుట్ట చూపిస్తూ.

కుతూహలంగా ఆ బుట్ట మూత తీసి చూశాను. జుట్టుతో అది నిండిపోయి ఉంది. నల్లటి, పత్తయిన జుట్టు ... ఎందుకు వూడిపోతూంది?

"డాక్టరుకు దగ్గరకు తీసికెళ్ళావా?" అడిగాను.

"ఇప్పటికి ముగ్గురయ్యారు. ముందు మా కాలనీ డాక్టరు మూర్తిగారి దగ్గరకు తీసికెళ్ళాము. ఏదో ఇంజక్షను చేసి పంపేశారు. ఈ వెర్రిచూపు తగ్గ లేదు. తర్వాత ఏవో పరీక్షలు చేసి, జబ్బు ఏమీ లేదన్నారు. న్యూరో సర్జన్ డాక్టర్ గౌతమ్ దగ్గర ఇప్పుడు ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నాం."

"భోజనం అదీ మామూలుగానే చేస్తున్నారా?" అడిగాను.


"తింటున్నారు. కాని, మామూలుగా కాదు. కంచంలో పెడితే తినరు. క్రింద పోసుకుని లన్నీ కలిపేసుకు తింటారు. నిన్నటి నుంచి చేతితో కలుపు కోవడం మానేశారు. పడుకుని, సరాసరి నోటితో కుక్కలా ..." అక్క ఇంకా ఏదో చెపుతూనే ఉంది. ఎందుకో తల త్రిప్పి చూశాను.

బావకళ్ళు నల్లటి కంటి గ్రుడ్డు స్థానంలో ముదురు తేనెరంగు కంటి పాపలు గుండ్రంగా లేవు. నిలువుగా, సన్నగా ... భయంకరంగా అనిపించాయి.

నా కెందుకో భయం వేసింది.

మధ్యాహ్నం ఇంటికి డాక్టరు గౌతమ్ వచ్చాడు. బావని పరీక్ష చేశారు. జుట్టు వూడిపోతూనే ఉంది కొంచెం కొంచెంగా. డాక్టర్ గౌతమ్‌కు పరిచయం చేసింది అక్క.

మే మెవరమూ భోజనం చేయలేదు డాక్టరు వచ్చేసరికి. వెళ్ళిపోతూ డాక్టరు నన్ను ప్రక్కకు






# తొలి క్రిస్మస్ గ్రీటింగ్ కార్డ్స్

**క్రిస్మస్** పండగ వస్తుందంటే శుభాకాంక్షల సీజను మొదలయిందన్న మాటే. మనం పండగ సమయాల్లో 'శుభాకాంక్షలు' పంపటానికి ఉపయోగించే గ్రీటింగ్ కార్డులు ఒక పరిశ్రమగా మారి, ప్రపంచంలోని అతి పెద్ద పరిశ్రమల జాబితాలో స్థానం సంపాదించిందంటే నమ్మడం కష్టం. ఒక్క బ్రిటిష్‌దీవులలో సాలీనా 900,000,000 క్రిస్మస్ గ్రీటింగు కార్డులఅమ్మకం జరుగుతూందని అంచనా.

ఈ పరిశ్రమ ఇంత లాభ సాటిది కాగలదని వూహించి ఉంటే గ్రీటింగ్ కార్డుల ఆవిరా వానికి పితామహుడైన 'సర్ హెన్రీ కోల్' ప్రపంచంలో గల కోటీశ్వరుల జాబితాలో ఎప్పుడో చేరి ఉండేవాడు.

సర్ హెన్రీ కోల్ వూహా చిత్రానికి ఆ రోజుల్లో ప్రఖ్యాతి గాంచిన 'జాన్ కాల్‌కాడ్' అనే చిత్రకారుని కుంచె నుంచి తొలి గ్రీటింగ్‌కారు ఉద్భవించింది. దీనిని హెన్రీకోల్ పేరుతో సమ్మర్‌బేస్ హోం ట్రెజరీ ఆఫీసు, 12, హోల్డు బాండ్ స్ట్రీటు, లండనునుంచి పోస్టు చేశారు. గ్రీటింగ్‌కార్డుల పితామహుడు హెన్రీకోల్‌కి లలితకళలంటే వల్లమాలిన అభిమానం. లండనులో గల 'విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియంలో మొట్టమొదటి డైరెక్టరుగా పని చేశాడు. సామాన్య ప్రజలకు లలిత కళలపై అభిరుచి కలిగించాలని ఈయన ఆలోచించే వాడు. ఈ ఆలోచన తుది రూపమే గ్రీటింగ్ కార్డు. ఆయన వూహించినట్లు నేడు గ్రీటింగు కార్డుల రూపేణా కళ కొంతైనా సామాన్య మానవుని చేరుకోగలుగుతూంది.

హార్సిలీ డిజైను చేసిన తొలి గ్రీటింగ్ కార్డు అడ్డవాటుగా ఉన్న దీర్ఘచతురస్రాకారంలో ఉండేది. ఈ కార్డులో ఒక పొదరిల్లూ, ఇంటి చుట్టు పక్కల పొడవాటి చెట్లూ, ఒక చెక్క టేబుల్ దగ్గర విక్టోరియా కాలానికి చెందిన వారనిపించే ఒక మధ్య తరగతి కుటుంబం మధ్యం పుచ్చుకుంటున్నట్లుగా చిత్రించబడింది. ఇంకా వారి హావ భావాల్లో ఈ విందులో పాల్గొనలేక పోయిన దూరాన ఉన్న బంధు మిత్రులను, స్నేహితులను జ్ఞాపకం చేసుకుంటున్నట్లుగా చిత్రించబడినది. ఎడమ పక్కన ఆకలి గొన్న వారికి ఆహారం ఇస్తున్నట్లూ, కుడి పక్కన ఒంటిమీద బట్టలు లేని నిరుపేదలకు వస్త్రాలు అందిస్తున్నట్లూ నిజమైన క్రైస్తవుడు చేయాల్సిన రెండు పనులూ ఇందులో చిత్రించబడ్డాయి. చిత్రం కిందిభాగంలో 'క్రిస్మస్ ఆనందాన్ని కొత్త సంవత్సరం సౌభాగ్యాన్ని తెచ్చుగాక' అనే సందేశం రాసి ఉంది. కుడి పక్కన కింది భాగంలో చిత్రకారుని పేరూ, 'క్రిస్మస్ 1843' అనే సంకేతమూ ఉన్నాయి. పైభాగంలో మనం గ్రీటింగ్ కార్డు పంపేవారి నామధేయం రాయటానికి వీలుగా చుక్కలుకూడా వదలబడ్డాయి.

ఇలా ఉద్భవించిన తొలి గ్రీటింగ్ కార్డు అనేక విధాలుగా రూపాంతరం చెంది నేడు ఆప్యాయతకు చిహ్నంగా అందరూ ఆకాంక్షించే అమూల్య కానుకగా వెల్లి విరుస్తూంది.

**- వెనిగళ్ళ వెంకటరత్నం**

పిలిచాడు.

"చూడండి. మిస్టర్ ఈశ్వర్! మీ బావగారు చికిత్స జరుగుతూనే ఉంటుంది. నాలుగయిదు రోజులుగా చూస్తున్నా. మీ అక్కయ్యగారు భోజనం [illegible]స్తున్నట్టు లేదు. నిద్ర పోతున్నట్టు కూడా లేదు. ఇలా అయితే ఆవిడ ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. మీరు వచ్చారు కాబట్టి, ఆవిడకు కొంత రిలీఫ్ ఇవ్వండి..."

"డాక్టరుగారూ! ఈ వ్యాధి ఏమి టంటారూ? నేను ఇదివరకు చూసిన దానికి ఇప్పుడు చూసినదానికి ఎంతో తేడా వచ్చింది. ఈ వారం రోజులలోనే ఇదంతా అని మా అక్కయ్య అంటోంది ..."

"ఈయనకు న్యూరోలాజికల్ డిస్ ఆర్డర్ ఏది ఉన్నట్లు అనిపించడం లేదు ... నరాల బలానికి ఏదో ఇంజక్షన్లు ఇస్తూనే ఉన్నాను. ట్రీట్ మెంటుకు అస్సలు రెస్పాన్సు లేదు" అని కొంచెంసే పాగి "సైకియాట్రిస్టు దగ్గరకు తీసికెడితే ... వూహు ..." సంశయంగా తల త్రిప్పాడు డాక్టరు.

డాక్టర్లు తమ నిస్సహాయతను వప్పుకోరు. చూచాయగా నైనా ఇది తమ వల్ల కాదు అంటే, కేసు ఎంతో సీరియస్ అనే అర్థం! అంతువచ్చని ఈ విచిత్ర వ్యాధి సైకియాట్రిస్టు వల్ల నయమవుతుందంటే అలాగే చేయాలి!

"చెప్పండి ఎక్కడికి వెళ్ళమంటారు. డాక్టరు గారూ! డబ్బుకోసం సంకోచించకండి. పర్వాలేదు. ఈ వ్యాధి తగ్గే ఉపాయం చెప్పండి."

"మిస్టర్ ఈశ్వర్! అనవసరంగా కంగారు పడకండి. సైకియాట్రిస్టు వల్ల ఇది నయమవుతుందనుకోను. మన సిటీలో మంచి సైకియాట్రిస్టులు ఎవరూ లేరు. సైకలాజికల్ ట్రీట్‌మెంటులో పేషంటు రెస్పాన్సు చాలా అవసరం. ఆయన మామూలు ఆరోగ్యం ... అంటే సాధారణంగా ఆహారం తీసుకోడం, సాధారణ నిద్ర ... వచ్చేటంత వరకు ఆగుదాం."

"అంటే... ఇది మామూలు జబ్బుకా దంటారు."

"అవును."

డాక్టరు కారు స్టార్టు అయి వెళ్ళేంతవరకు నేనొక అనిశ్చిత పరిస్థితిలో ఉండిపోయాను. ఒక్కసారి అక్కయ్య గుర్తు కొచ్చింది. బావకు ఏమయినా అయితే ఆమె భవిష్యత్తు ... పిల్లల భవిష్యత్తు ...?

జీవంలేని చూపుతో బావ అలా కూర్చునే ఉన్నాడు.

కొంచెం ఎంగిలిపడ్డ తర్వాత బావకు గ్లాసులో పాలు ఇచ్చాను. తాగలేదు. తాకలేదు. కొంతసేపటికి కుర్చీలో వాలి నిద్రపోయాడు. అక్కయ్య ఏడుస్తూ కూర్చుని ఉంది. పిల్లలిదరూ మధ్యాహ్నం భోజనానికి వచ్చారు. నేనే వాళ్ళిద్దరకు అన్నం పెట్టి పంపేశాను.

"అక్కయ్యా! ఇలా మొదటిసారి ఎప్పుడు జరిగింది?" అడిగాను.

"పది రోజు లయిం దనుకుంటూ... ఒక రోజు పిలిచారు—హైమా! ఒక్కసారి ఇలారా అ[illegible] నేను వెళ్ళాను.

"మా పడక గది కిటికీలో నుంచి చూస్తున్నారు[illegible] ఎంత అందంగా ఉందో చూడు ఆ చింతచెట్టు[illegible] కింద ఆ తుప్పలు, అవీ అన్నారు. నేను చూశాను కిటికీలోనుంచి. పెద్ద చింతచెట్టు. భూతంలా పరుచుకుని ఉంది. తీగలు తుప్పలూను. నాకు అందంగా కనపడ లేదు. అందుకే—

'నా కేం అందంగా కనపడడం లేదు. భయ[illegible] వేస్తూ ఉందికూడా. అసలు మనం ఇక్కడ కిటి[illegible] పెట్టించకుండా ఉండాలిసింది' అన్నాను.

'మరెక్కడ పెడతాం. ఈ వెనకల ఉన్న స్థల[illegible] గవర్నమెంటు ది.దూరంగా ఆ గుడిసె కనిపిస్తుం[illegible] చూడు. అది ఎవరో బంజారా వాడు వేసుకున[illegible] గుడిసె. అదీ ఎప్పుడో పీకేస్తారు, గవర్నమెంటుకి అవసరం వస్తే.'

'సాయంత్రం తిరిగ్గా ఆ అడివిని చూసుకి[illegible] వచ్చు. ఇవాళ ఆడిట్ రిపోర్టు ఫైనలైజ చెయా[illegible] లన్నారు. మీ కింద పని చేస్తున్న ఇద్దరూ ఎ[illegible] టీములు బయట హాలులో కూర్చున్నారు.'

'ఔను. మరిచేపోయా. ఈ వనం అంద చందా[illegible]

సాయంత్రం చూస్తా.

'చీకటిలో బాగా కనపడుతుంది' అన్నాను నేను కాస్త కోపంగానే.''

అక్కయ్య కథ విన్న తరవాత అనిపించింది నాకు. మానవ మేధస్సుకు అందని ఏదో అతీత శక్తి బావను పీడించడం లేదు కదా.

● ● ●

సాయంత్రం డాక్టర్ గౌతం ఇంకొక డాక్టరును పిలుచుకు వచ్చాడు. తెల్లటి బట్టల్లో హుందాగా ఉన్నాడు ఆ వచ్చినాయన. విశాల ఫాలభాగం విజ్ఞానాన్ని, అఖండమైన తెలివిని సూచిస్తున్నాయి.

''ఈయన నిరంజన్ స్వరూప్. న్యూరాలజీ పరిశోధనలు జరుపుతున్నారు. మద్రాసు నుంచి ఢిల్లీ వెళుతున్నారు. అయితే ఢిల్లీకి టేకాఫ్ అవుతూంటే విమానాన్ని పక్షి ఢీ కొంది. విమానాన్ని రిపేరు కోసం దింపేశారు. ఈ రాత్రికో, రేపటికో కాని ఆ విమానం బాగా పూర్తి కాదు. నన్ను చూద్దామని వచ్చారు. మీ బావ కేసు గురించి చెప్పాను. పేషంటును చూస్తా నన్నారు.''వివరించాడు డాక్టర్ గౌతమ్.

బావని పరీక్షించిన త రవాత నిరంజన్ అడిగాడు ఇంగ్లీషులో—ఇది ఎలా మొదలయిందని. అక్క చెప్పిన విషయాలు చెప్పాను. జాగ్రత్తగా విన్న తరవాత, డాక్టర్ నిరంజన్ అన్నాడు.

''దిస్ మే బీ డ్యూ టు ఎ సడన్ షాక్. ఫిజికల్లీ దేర్ ఈజ్ నథింగ్ రాంగ్!''

సడన్ షాక్ వల్ల ఇలా అయి ఉండవచ్చు! శారీరకంగా ఏ లోపమూ లేదా?

ఏవో మందులు రాసిచ్చి వాళ్ళు వెళ్ళిపోయారు.

బావకు తగిలిన ఆ షాక్ ఏమిటి?

● ● ● ●

పిల్లలు గట్టిగా అరిచి చదువుతూంటే ఈ రోజుకు చదువు అక్కర లేదు—పడుకోండి అని చెప్పింది అక్క. పుస్తకాలు అవతల పారేసి మంచా లెక్కారు పిల్ల లిద్దరూ. కొంచెం సేపు అల్లరి చేసి నిద్రలోకి జారుకున్నారు.

బావ పడక కుర్చీ వదల లేదు. కళ్ళు అలాగే జీవం లేనట్టే ఉన్నాయి. కొంచె ంకొంచెం జుట్టు రాలిపోతూనే ఉంది. రక్త లేమివల్ల ముఖం పాలి పోతూన్నట్లు అనిపిస్తూంది. చేతి వేళ్ళు, కాలివేళ్ళు నీళ్ళలో తడిసి నట్టుగా ముడతలు పడుతున్నాయి..

అక్కని పడుకోమని చెప్పి, బావ ఎదురుగా కుర్చీలో కూర్చున్నాను నేను. లైటు తీయలేదు. ఏదో పుస్తకం చదువుతూ ఉండిపోయాను.

అర్ధరాత్రి అయి ఉంటుంది. గుర్. గుర్. గు. . ఏదో శబ్దం వినిపించి ఉలిక్కి పడి లేచాను.

కుర్చీలో బావ లేదు.

నిద్ర మత్తు దిగిపోయింది.

బావ ఎక్కడికి వెళ్ళాడు?

వీధి తలుపు వైపు చూశాను. తాళం వేసే ఉంది.

మానసికంగా బావ దిగజారి పోయాడు. మెదడులో ఏవో భాగాలు పని చేయడం లేదు. అయితే శారీరక అవసరాలు పూర్తిగా మాసిపోవుగా. అక్క చెప్పినట్టు



ఏదో జంతువు తింటున్నట్టుగా ఈయన తిండి తింటాడేమో?

కుర్చీలోంచి లేచాను. ఈయన ఏం చేస్తూంటాడో చూడాలి.

అడుగులో అడుగు వేసుకుంటూ వంటఇంటి వైపు నడిచాను. మనస్సులో భయం నన్ను వెనక్కి లాగింది. నవ్వు వెళ్ళేది మనిషి దగ్గరకు కాదు. మనిషి ఆకారంలో ఉన్న ఒక జంతువు దగ్గరకు జాగ్రత్త.

చుట్టూ చూశాను ఏదైనా ఆయుధం కోసం. పిల్లలాడుకునే ప్లాస్టిక్ బాట్ తప్ప ఏం లేదు. అదే తీసుకున్నాను.

వంటిల్లు చీకటిగా ఉంది. వెనక హాలులో అక్క, పిల్లలు పడుకున్నారు.

లైటు వేశాను.

గిన్నెలు బోర్లించి ఉన్నాయి. అన్నం చిందర వందరగా పడి ఉంది.

అక్కడ బావ లేడు.

మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చాను. అక్కను లేపడమా? మానడమా? వారం రోజుల నుంచి నిద్ర లేక, నేను వచ్చాను కదా అన్న ధీమాతో నిద్ర పోతూ ఉంది. ఎలా? ఆఖరికి అక్కను నిద్ర లేపడానికి నిశ్చయించుకున్నాను.

''అక్కా...అక్కా'' పిలిచాను.

ఉలిక్కి పడి లేచింది.

''బావ కనపడడం లేదు.'' అన్నాను.

గబుక్కున లేచింది. వంటింటి వైపు నడిచింది. నేను అక్కడి లైటు తియ్యలేదు. ఇంకా వెలుగుతునే ఉంది. పరిస్థితి చూసింది. ఒక క్షణం ఆలోచించింది.

పడకటింటి తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి. తలుపు తెరిచి, లైటు వేసింది. ఆ చీకటిలో అరవై కాండిల్స్ బల్బు మెరుపులా మెరిసింది.

మంచం పైన బావ కూర్చుని ఉన్నాడు.

ఎదురుగా పెద్ద కిటికీ తెరిచి ఉంది.

నేను కిటికీలోంచి చూశాను. చీకటిలో పెద్ద చింతచెట్టు. కృష్ణపక్షంలో అష్టమి రోజు. గుడ్డిగా చంద్రుని వెలుతురులో పెద్ద భూతంలా చింత చెట్టు.

మంత్రముగ్ధుడై చూస్తున్నట్టు చిన్న పిల్లలు



ఆనందంగా ఏ సినిమా వో చూస్తున్నట్టు తీక్షణంగా; పూర్తి వశీకృతుడైనట్టుగా ఆ చెట్టు కేసి, ఆ పెరిగిన మొక్కల కేసి చూస్తున్నాడు బావ.

''టప్.'' కిటికీ మూసేసింది అక్క.

బావ మొహంలో ఒక క్షణం నిరాశ మెదిలి మాయమయింది.

మే మిద్దరమూ బావను మళ్ళీ వీధిగదిలోకి తీసుకు వచ్చాము. బావ కుర్చీలో కూర్చున్నాడు. మళ్ళీ అదే జీవంలేని చూపు. అక్క ఒక పెద్ద తాళాన్ని పడకటింటికి బిగించింది.

ఇక ఆ తరవాత మేమిద్దరమూ నిద్ర పోలేదు.

● ● ● ●

''అక్కా! ఆ కొత్త డాక్టరు బావకు ఏమైనా షాక్ తగిలి ఇలా అయిపోయాడని అభిప్రాయ పడుతున్నాడు. నీకు గుర్తు ఉన్నంత వరకు ఈ పదిరోజులలో తట్టుకోలేని షాకుకు బావగాని గురిఅయ్యారా?'' కాఫీ తాగుతూ అడిగాను.

''అటువంటి దేమీ లేదు. ప్రాక్టీసు బాగా ఉంది. నెలకు రెండు వేల దాకా ఆదాయం వస్తూంది. ఇంటిమీద అప్పు తీరుస్తున్నాం. ఎప్పుడూ కులాసాగా ఉంటారు కదా మీ బావ. ఆఫీసులో చికాకులు లేవు. క్లైంట్లందరూ మంచివాళ్ళే. ఎవరో ఒకరిద్దరూ ప్రయాస పెట్టినా, ఈయన పట్టించుకునే రకం కాదు.''

''కది రోజుల క్రితం ఏదైనా విశేషం లాటిది జరిగిందా.''

''ఎప్పుడూ రొటీన్ జీవితమే. అలాటిదేమీ లేదు. అయితే రోజూ నన్ను పేపరు చదవమని పోరు పెట్టేవారు. నాకు పేపరు చదవడమంటే పరమ బోరు. వో పిల్లల తల్లీ, ఈ వార్త చదువు. పిల్లలను ఎత్తుకు పోయే వాళ్ళు వచ్చారట. ఇలాటివి చదివితే లోకంలో ఏ జరుగుతుందో తెలుస్తుంది—అన్నారు.''

''మరి ఆ పేపరు చదివావా?''

''లేదు. పని తీరిక అయిన తరవాత చదువుదామని మరిచిపోయా.''

''ఇప్పుడు ఆ పేపరు ఉందా?'' అడిగాను.

''చదివిన పేపర్లన్నీ ఒక పక్క నీట్‌గా పెట్టడం ఆయనకు అలవాటు. తేదీల వరస తప్పితే బలె కోపం వచ్చేది. చదవని పేపర్ల కుప్ప ఈ పక్కన. తరవాత ఆయన పేపరు చదివిం దేదీ?''

అక్కయ్య ఆ పేపరు తీసి ఇచ్చింది. చూశాను.

## పిల్లల దొంగ లున్నారు!

## భయం! భయం!

అక్టోబరు 19: పిల్లల అపహరణ ప్రయత్నాలకు సంబంధించిన కొన్ని సంఘటనలు వెలుగులోకి వస్తూండడంలో చిలకలూరి పేట ప్రాంతంలోని పురుషోత్తమపట్నం, పోతవరం, రాజాపేట గ్రామాల ప్రజలలో తీవ్ర భయాందోళనలు చోటు చేసుకుంటున్నాయి. గత పది రోజుల నుంచి ఈ గ్రామాలలోని ప్రజలు తమ పిల్లలను బడికి పంపటానికికూడా

అంటుకున్నారు. చిలకలూరిపేట సమీపంలోని పురుషోత్తమపట్నం వద్ద ఇటీవల జరిగిన సంఘటన ఈ ప్రాంతం ప్రజలలో తీవ్ర సంచలనాన్ని సృష్టించింది.

మోటారుసైకిలుపై వచ్చిన ఇద్దరు అపరిచిత వ్యక్తులు ఒక కుర్రవాని మామకు అనారోగ్యంగా ఉందని, ఆ రోగిని ఆసుపత్రిలో చేర్చారని చెప్పి మోటారుసైకిలుపై ఆ కుర్రవానిని గుంటూరు వైపు తీసుకుని వెళ్ళారని చెప్పాడు.

—ఇలా సాగిపోయింది వార్త.

"ఈ సంఘటనల అనంతరం ప్రస్తుతం ఈ గ్రామంలో ఏర్పడిన భయానక పరిస్థితి వల్ల పశువుల తోలుకు వెళ్ళే పిల్లలు పనులు మానివేశారని, గ్రామాలలోని స్త్రీలు కూలి పనులు మానివేసి తమ పిల్లలను వేయి కళ్ళతో కాపాడుకుంటున్నారని పోత వరం, రాజాపేట, పురుషోత్తమ పట్నం గ్రామస్తులు తెలిపారు. రక్తానికి గిరాకీ ఉన్నందువల్ల పిల్లలను అపహరించి వారి రక్తాన్ని తీసుకుంటున్నారని, అదే విధంగా పిల్లలను అపహరిస్తున్న ముఠా కళ్ళు, మూత్ర పిండాల వంటి అవయవాలను తొలగించి వాటిని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారన్న వదంతులు కూడా చిలకలూరి పేట ప్రాంతంలో వ్యాపించాయి."

పూర్తిగా చదివాను న్యూస్ ఐటమ్ ...

ఇదేం షాక్ ఇచ్చే విషయంలా నాకు కనబడలేదు. ప్రతి ఏడెనిమిదేళ్ళకు ఒక సారి ఇటువంటి వార్తలు రావడం పరిపాటి. నా చిన్ననాటి అనుభవం గుర్తుకొచ్చి నవ్వు వచ్చింది. అప్పుడు నాకు పన్నెండేళ్ళు. పిల్లల అపహరణ వార్తలు ముమ్మరంగా వినిపిస్తున్నాయి. పిల్లలను గోనె సంచీలలో వేసి మోసుకుపోయి దేనికి బలి ఇస్తారనీ ఇలా ఇవేవో వదంతులు. కొంతమంది పిల్లలు ఎలా తప్పించుకున్నదీ వివరాలు దిన పత్రికలలో పడేవి. ఎవరైనా గడ్డాలతో కనిపించినా, పెద్ద పెద్ద కుంకుమ బొట్లతో కనిపించినా గోనె సంచులతో కనిపించినా, హడలిపోయి పారిపోయే వాళ్ళం ... రాత్రుళ్ళు భయంకరమైన కలలు.

● ● ● ●

రాత్రి అయింది. పిల్లలు, హైమవతి పడుకున్నారు. వంటింట్లో గిన్నెలు అవీ అందుబాటులో ఉండేటట్లు ఉంచి తలుపుతీసి ఉంచాను. పడకగది తలుపుకు తాళం వేసి ఉంది.

ఈయన ఆ కిటికీలోనుంచి ఏం చూస్తాడు. చింతచెట్టులోగాని, అడ్డదిడ్డంగా పెరిగిన గడ్డిలో గాని ఈయనకు ఏం కన్పిస్తుంది? మతిపోయినట్లుగా అలా చూస్తుండి పోతాడు ఎందువల్ల?

రేపు ఆ ఖాళీ స్థలంలో ఏముందో చూడాలి. ఆ స్థలానికి ఆనుకునే ఏదో పెద్ద గోడ, ఆ ప్రదేశం, ఈ ఇంటికి వెనుక భాగాన ఉంది. దారి మాత్రం దూరంగా గుడిసె అన్నారే అదేనేమో? రేపు చూడాలి అనుకున్నాను.

బాటరీ లైటు దగ్గర ఉంచుకుంటే బాగుంటుంది అనిపించింది. అక్కయ్యను అడిగి తీసుకున్నాను. పవర్‌ఫుల్ స్పాట్ లైటు.

## ఆదికవి

నన్నయ శైలి సులభగ్రాహ్యము. ఈతని సమాసము లన్నియు సరళ సౌలభ్యమున దనరారు చుండును. శయ్యానుపాత్యము, ఉద్దతి, సౌకుమార్యము: అనబడు ఈ మూడు గుణములును సౌరభ్య సౌందర్య లావణ్యములతో నలరారు పరిమళ కుసుమములవలె నీతని శైలియందు కనిపించును. కథనమునందు మితమును, స్పష్టతయు, సూటిదనము గానవగును. ఆంగ్లమున "క్లాసికల్" అనబడు గ్రీకు శిల్పమునందువలె నన్నయ రచనా శిల్పమునందు ప్రపూర్ణత వెలసియున్నది.

ఆంగ్లమున 'చాసరు' కవీంద్రునితో నన్నయ భట్టారకుని బోల్చవచ్చును. ల్యాటిను గ్రీకు భాషల వ్యామోహమున బడక దేశపదములనే యుపయోగించి తొలుదొల్త యాంగ్లమున కావ్యరచనకు గడిగినవాడు 'చాసరు' కవి. అటులనే నన్నయయు దేశపదములను, దేశి పద్యరీతులను గైకొని యుత్తమ కావ్యరచనకు బూనుకొనినాడు.

**మాచిరాజు సీతాపతిరావు**

(ఆంధ్ర సారస్వత చరిత్ర సంగ్రహం నుంచి)

పుస్తకం తీసుకున్నాను. పుస్తకం పేరు 'ది పీపింగ్ వుడ్స్' చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంది. చదువుతూ చదువుతూ, బావకేసి చూస్తున్నాను. పడుకుని ఉన్నాడు.

రాత్రి నిద్రలేదేమో కొంచెం కునికిపాట్లు వచ్చాయి. నిద్రలో' జారుకుంటూండగా అక్కయ్య అరిచి లేపింది.

"ఒరే ... ఈశ్వర్ ... లే ... నీ మొద్దునిద్రా నువ్వూను ..."

కంగారుగా లేచాను. ఒక క్షణం ఎక్కడున్నానో అర్థం కాలేదు.

"బావ మళ్ళీ కనబడడం లేదు." ఆదుర్దాగా అంది అక్క.

"వంటింట్లోనూ, పడక గదిలోనూ వెదికావా? అడిగాను.

"ఊఁ ... పడక గది తాళం అలాగే ఉంది."

వీధి తలుపు ఓరగా తెరిచి ఉంది.

అయితే ఈయన తలుపు తెరుచుకుని బయటకు వెళ్ళాడన్న మాట ... అనుకున్నాను.

బాటరీ స్పాటు లైటు దగ్గర పెట్టుకోవడం మంచిదయింది.

"అక్కా చెప్పులు తొడుక్కో. బైట చూద్దాం."

నేనుకూడా చెప్పులు తొడుక్కుని బయటకు వచ్చాను. చల్లటి గాలి రివ్వున వీచింది. శ్రీవిధి కాలనీకి ఇంకా వీధి లైట్లు వేయలేదు. చీకటి ... ఒక్కడక్కడా ఇళ్ళు, విసిరేసిన ఇటుక ముక్కల్లా పడి ఉన్నాయి.

మెట్లుదిగి బాటరీ లైటు కాంపౌండు అంత తిప్పాను. నీటి కొళాయి ... కొబ్బరి మొక్క ... పనస మొక్క... పూల మొక్కలు...సంయ్య ... తెల్లటి పైజామా ... లాల్చీ గాలిలో ఊగుతున్నాయి. బావ ఇక్కడ నిలబడ్డాడు. ప్రక్క స్పాటు వైర్ ఫెన్సింగు, ఈ ఇంటి కాంపౌండు గోడ, బయట ఖాళీ ప్రదేశం కలుసుకొనే చోటు.



ఇప్పుడు చింత చెట్టు పూర్తిగా కనపడుతోంది. పడమట చంద్రుడు అస్తమిస్తున్నాడు.

మేము రావడం గాని, "అయ్యో! మీ రిక్కడ ఉన్నారా?" అని అక్కయ్య పిలుపు గాని వినలేదు బావ. ఏదో చూస్తున్నాడు ... గోడపై విరగబడి.

బాటరీ లైటు బావ చూస్తున్న వైపు ఫోకస్ చేశాను. క్రొత్త బాటరీ వల్ల కాంతి బాగా ఉంది.

చింపిరిగా ఉన్న మొక్కలు ... వాటి మధ్య గుండ్రంగా ఖాళీ స్థలం ... ఒక మొక్కా పెరగలేదు. అలా అని రాయిలా లేదు. మట్టినేల... ఆ నేల మీద వెనక కాళ్ళకు ఆనుకుని ముందు కాళ్ళు ముందుకు చాచి ... ఒక కుక్క. నల్లగా, నిగనిగలాడుతూ ఉంది. మొహంపై తెల్లటి చార. నాలుక బయటకు పెట్టింది. తెల్లటి కోరలు మెరుస్తూ ఉన్నాయి. ఆ కళ్ళు, నిశితంగా, క్రూరంగా బావకేసే చూస్తున్నాయి.

నా రక్తం గడ్డకట్టుకున్నట్టయింది. ఒళ్ళు జల్లుమంది.

మేం చూస్తూండగానే ఆ కుక్క లేచింది. ఎడమ వైపుకు వెళ్ళింది. బాటరీ ఫోకస్ చేశాను. ఈ ఇంటి వెనకకి, పెద్ద గోడకి మధ్య చిన్న కంతలా ఉంది. దానిలో ప్రవేశించింది... నడుస్తూ ఏదో ధ్వని గుర్ ... గుర్ ...

కళ్ళు తెరుచుకుని విభ్రాంతురాలై చూస్తోంది అక్క. . .

బావను పట్టుకుని ఇంటిలోనికి తీసుకు వెళ్ళాము. జీవ శక్తి పోతూ ఉన్నట్టుగా తేలికగా అయిపోతున్నాడు బావ.

ఇంటిలో వెళ్ళి తలుపు వసాశాము. బావను పడుకోబెట్టిన తర్వాత ఆ కుక్క సంగతి గుర్తుకొచ్చింది.

తలుపు తెరిచి చూశాను. బాటరీ లైటు కాంతిలో ఆ కుక్క ఇప్పుడు ఇంటి ముందు కూర్చుని ఉంది. ఎర్రటి నాలుక తెల్లటి కోరలు. . .అదే చూపు. . .నిశితంగా. . .క్రూరంగా. . .ఆ కుక్క. పిల్లవాడు ఆడుకునే ప్లాస్టిక్ బాట్ విసిరేశాను. ప్రక్కగా పడింది. . .కుక్క కదలలేదు. విసరడానికి ఇంకేదయినా దొరుకుతుందేమోనని ఇంట్లోకి వచ్చాను.

"గుర్.. .గుర్. . ." శబ్దం దగ్గరగా వినబడింది.

కుక్క లోపలికొచ్చిందా!

బాటరీ లైటు మళ్ళీ ఫోకసు చేశాను వీధిలోకి. . అక్కడ కుక్క లేదు. ప్రక్కన ఉన్న ఖాళీ స్థలంలో నుంచి, బార్బ్‌డ్ వైరు దాటి, వెడుతూంది.

మళ్ళీ ఆ చింత చెట్టు కింద, ఆ ఖాళీ స్థలంలో కూర్చుంటుందేమో. . .ప్రదక్షిణ. . .ఒక ప్రదక్షిణ పూర్తి చేసింది.

ఈ కుక్క ఎవరిది? ఈయన వెంట ఎలా పడింది? మామూలు కుక్కలా లేదు. . .అర్ధరాత్రి పూట ఏ ఇంటి అరుగు మీదో ముడుచుకుని పడుకుంటాయి. ఇలా ఇంటి చుట్టూ ప్రదక్షిణ ఎందుకు చేస్తున్నట్టు. . .రేపు చూడాలి

(సశేషం)

# త్రిజట

గంటి రమాదేవి

(క్రిందటి సంచిక తరువాయి)

**డాక్టర్** గారిచ్చే ట్రీట్‌మెంటు ఏమీ ప్రయోజనం ఉండడం లేదు. ఇది ఒంటికి పుట్టిన రోగం కాదు అని ఆయన ఉద్దేశం. . .డాక్టరు రోగాన్ని నయంచేయగలడు—కాని, ఇది రోగమో, మానవాతీత శక్తో తెలియడం లేదు.

"అక్కయ్యా! ఈ ఇంటి వాస్తు చూశారా... ఏమైనా లోపాలున్నాయేమో ?" అడిగాను.

"వాకన్నా ఎక్కువ పట్టింపు మీ బావకు. అన్నీ పక్రమంగా చూసే కట్టింది. . .వాస్తు గావు. . . ఆయనకే ఏదో పట్టింది. . ." రుద్ధ కంఠంతో అంది అక్క.

"ఎవరికయినా భూత వైద్యులకు చూపిద్దాం... .మందుతో తగ్గనిది, మంత్రంతో తగ్గుతుందేమో. . ."

"అదే నేనూ అందామనుకుంటున్నాను. . ." అంది అక్క.

• • • •

మధ్యాహ్నం డాక్టరు వచ్చి చూసిన తరువాత నేను బయటకు వచ్చాను. ఇప్పుడు డాక్టరు రాకకు అంత ప్రాధాన్యం ఇవ్వడం లేదు. బావ పడక కుర్చీలో వాలిపోతూన్నాడు. ప్రాణ శక్తి రోజు రోజుకూ తగ్గుతూంది. నిన్న రాత్రి ఆ కుక్కను చూసినప్పటి నుండి పరిస్థితి దిగజారిపోయింది.

రెండు ఫర్లాంగుల శ్రీనిధి కాలనీకి సమాంతరంగా నడిచిన తరువాత ఆ ఖాళీ స్థలం ప్రవేశం దగ్గరకు చేరుకున్నాను. పూరి గడ్డితో, గోనె సంచులతో వేసిన గుడిసె ముందు కూర్చుని ఉన్నాడు ఒక ముసలివాడు. బహుశా ఆ కుక్క వీడిదేమో!

నేను ఈ వెనక కాలనీలో ఉంటున్నానని, ఈ ఖాళీ ప్రదేశం చూడాలనీన్నీ చెప్పాను.

"దొరా! ఇది , సర్కారు నేల. . .ఇదివరకు ఇక్కడో బైరాగి ఉండేవాడు..." వచ్చీరానీ తెలుగులో చెప్తున్నాడు.

"లోపల చూడవచ్చా. . ."

"చూడడానికేం ఉంది, దొరా... అంతా తుప్పలు, ముళ్ళు. . ."

నేను ముందుకు నడిచాను. . .అన్నీ తుప్పలూ, ముళ్ళూ. . .వాడు చెప్పినది రైటే.

చటుక్కున గుర్తుకొచ్చింది కుక్క సంగతి.

"నీకు కుక్క ఉందా?" అడిగాను.

"ఉంది, దొరా! కాని, ఇపుడు సచ్చిపోయింది."

నడుస్తూ, నడుస్తూ ఇద్దరం మా ఇంటి వెనుక భాగానికి వచ్చాం,

చింత చెట్లు, పిచ్చి మొక్కలు మధ్యలో ఏ మొక్క పెరగని ఖాళీ స్థలం.

"ఇక్కడ ఏ మొక్క పెరగలేదేం?" అడిగాను ఆ ముసలాడిని.

"ఇది అప్పుడొక బైరాగి ఉండిన గుడిసె స్థలం."

పరీక్షగా చూశాను ఆ స్థలాన్ని. . .

ఆ నేలకు, చుట్టూ ఉన్న నేలకు తెడా ఉంది. ఖాళీ స్థలంలో నేల ఎర్రగా ఉంది. రక్తంతో తడిసినట్టు!

• •

ఇంటికి తిరిగి వచ్చాను. ఎవరో ఇంటిలో ఉన్నారు.

"తమ్ముడూ. . .ఈయనే మా ఇంటి శంకుస్థాపనా, గృహప్రవేశమూ చేయించిన పురోహితులు."

నేను నమస్కారం పెట్టాను. దాదాపు అరవై ఏళ్ళుంటాయి. విశాలమైన నుదుటి మీద విభూతి రేఖలు. జంధ్యానికి ఒక రుద్రాక్ష వేలాడుతూంది.

"చిరంజీవ" అని దీవించా డాయన.

"అమ్మాయి అంతా చెప్పింది. ఈ ఇంటికి వాస్తులో ఏ లోపం లేదు. అయితే, మీ బావగారు చికిత్సకు లొంగకుండా ఇలా దిగజారిపోవడం నాకు అంతు పట్టడం లేదు. అగ్రహారంలో మాధవశర్మ అని ఒక మంత్రవేత్త ఉన్నారు. ఆయన ఇటువంటి రుగ్మతలు తగ్గించడంలో ఉద్దండుడు. . .వెంటనే నీవు అతన్ని కలుసుకో. ఒక విషయం—అందరిలా ఆయన ఆర్భాటం చేయడు. మేకలు, కోళ్ళు, గుమ్మడి కాయలు, నిమ్మకాయలు ఇవేవీ ఉండవు. ముగ్గు వేసి, నిప్పు రాజేసి, నేతితో హోమం మాత్రం చేస్తాడు. క్షుద్ర విద్యలు అభ్యసించినవాడు కాడు. మహాదేవిని పూజిస్తాడు. . ." అని సలహా ఇచ్చాడు ఆ పురోహితుడు.

ప్రమాదం ముంచుకొస్తున్నప్పుడు హేతువాదాన్ని ఎవరూ ఖాతరు చేయరు. విపరీతమైన కష్టబాధకి ఏదైనా సమిధే. కడుపు నిండితేనే రుచులు. భయం లేనప్పుడే తర్కాలు, విమర్శలు.

దిగజారి పోతున్న బావ పరిస్థితి నన్ను వెంటనే మాధవశర్మ దగ్గరికి తీసుకుపోయింది.

అగ్రహారంలో చాలా పెద్ద ఇల్లు అది. ముందు కొబ్బరి తోట. వెనకకు తాటాకుల ఇల్లు. ఇంటి అరుగు మీద ఒక ధృఢకాయుడు కూర్చుని ఉన్నాడు. అతని ముందు అగ్నిహోత్రం వెలుగుతూంది. మామిడి ఆకుతో అగ్నిలో నెయ్యి వేస్తూ హోమం చేస్తున్నాడు. ఆయన నన్ను చూసేవరకూ ఆగి, నమస్కరించాను. పూర్తిగా వివరించాను బావ సంగతి.

"నిన్నటి రోజున విచిత్రం జరిగింది. మా ఇంటి వెనక భాగం నుండి ఒక కుక్క మా బావకేసి తీక్షణంగా చూస్తూ, ఇంటి చుట్టూ తిరిగింది" అన్నాను ఆఖరుగా.

మాధవశర్మగారిది భారీ విగ్రహం. . .దీపాల్లా వెలుగుతున్న కళ్ళు ఒక్కసారి కుంచించుకుపోయాయి నే నీ ఆఖరు మాటలు చెప్పగానే.

"త్రిజట. . .త్రిజట. . ." అని గొణుక్కున్నారు.

లోపల నుంచి ఏదో పాత పుస్తకం పట్టుకుని వచ్చారు.

"ఒక్కోసారి అమాయకులు, నిర్దోషులు పరిస్థితుల ప్రభావం వల్ల బలైపోతూ ఉంటారు. పద్నాలుగవ శతాబ్దంలో ఒక మహనీయుని అనవసరంగా అనుమానించి ఉరి తీయించాడు ఒక రాజు. . .ఆ మహనీయుని ఆత్మ ఇది సహించక ప్రతీకారం తీర్చుకుంది. ఆ రాజు పడుకునే కిటికీ ఎదురుగా చెట్టుపై గుడ్లగూబ రూపంలో ఎదురు చూస్తూ కూర్చుంది— రాజు అంతంకోసం.

ఆ గుడ్లగూబను చూసిన రాజు రోగగ్రస్తుడైనాడు. రోజురోజుకూ క్రుంగిపోతున్న రాజు పరిస్థితికి ఆ గుడ్లగూబే కారణమని, దానిని చంపాలని ప్రయత్నించారు రాజు పరివారం. ఆ గుడ్లగూబ రాజు కోట చుట్టూ ప్రదక్షిణ చేస్తూంది ఎగుడు దిగుడుగా—జడ ఆకారంలో. అలా బంధించిన వలయంలోకి ఏ శక్తి ప్రవేశించలేదన్న మాట. రెండవ రోజు ఇంకొక ప్రదక్షిణ పూర్తి చేసింది. రాజు శరీరంలో అయిదింట నాలుగు ప్రాణాలు ఎగిరిపోయాయి. ఆఖరి ప్రదక్షిణతో రాజు ప్రాణాలు అనంత విశ్వంలోకి ఎగిరిపోయాయి. త్రిజట. . . మూడు జడలు. . .ఈ మూడు జడలు పూర్తి అయితే, రోగిని ఎవ్వరూ రక్షించలేరు."

మాధవశర్మ గంభీర కంఠం నా చెవిలో గింగురుమంది.

"అయితే ఈ కుక్క విషయం మన అనుమానం కావచ్చు. ఈ రోజు రాత్రికి నన్ను పరీక్షించని..."

చీకటి పడక ముందే మాధవశర్మగారిని ఇంటికి తీసుకువచ్చాను. పిల్లలిద్దరూ ఆయనను చూసి భయపడి ఒక మూలకి దాక్కున్నారు.

బావ దగ్గరిగా మట్టి పోసి, దాన్నిపైన ముగ్గు పోసి, పిడకలు పేర్చి హోమ గుండం తయారు చేశారు మాధవశర్మగారు.



బాటరీ లైటు ఇంకొకటి సిద్ధం చేసుకున్నాను.

రాత్రి అయింది. పిల్లలు ఈ తతంగమంతా చూస్తూ నిద్రపోలేదు. ఏదో మంత్రాలు చదువుతూ కూర్చున్నారు శర్మగారు.

అమావాస్య దగ్గర పడుతూంది. చీకటి చిక్కగా కాలనీ అంతా వ్యాపించింది.

బావ అలా శూన్యంగా చూస్తూనే ఉన్నారు.

సగం రాత్రి అయింది.

"గుర్. . .గుర్. . ."

ఇంటి వెనకవైపు నుంచి శబ్దం. . .

అదిరిపడ్డాం అందరమూ.

బావ లేచాడు. మంత్రించినవాడులా తలుపు తీసుకుని బయటకు నడిచాడు.

నేను ఆపబోతూంటే, నన్ను వారించారు మాధవ శర్మగారు.

మేము అనుసరించాం.

బాటరీ లైటు వేశాను. రెండవది కూడా అదే ప్రదేశంలో ఫోకస్ చేశాను. హోమంలో మండుతున్న ఒక సమిధతో మాధవశర్మగారు ఆ ప్రదేశానికి వచ్చారు.

దీపం కాంతిలో ఆ కుక్క. . . తీక్ష్ణంగా, నిశితంగా క్రూరంగా బావకేసి చూస్తూంది. బావ కూడా మంత్రముగ్ధుడైనట్టు వశీకరింపబడినట్టు ఆ కుక్కకేసే చూస్తున్నాడు.

"ఈశ్వర్. ఆ కుక్కను ఎడమవైపుకు వెళ్ళనివ్వకు. ఈ నిప్పు ఎడమ వైపుకు విసరేయ్" అన్నారు మాధవశర్మగారు.

విసిరేశాను.

కుక్క లేచింది. ఇంటి వెనకవైపు ఉన్న సందులోకి వెళ్ళిపోయింది.

హతాశులయ్యారు మాధవశర్మగారు.

"త్రిజట. . . త్రిజట . . ." అని గొణుక్కున్నారు.

కొంతసేపటికి ప్రదక్షిణ పూర్తి చేసి ఇంటి ముందుకు వచ్చిందా కుక్క. వెనక కాళ్ళ మీద ఆనుకుని, ముందు కాళ్ళు పెట్టుకుని గుమ్మంకేసే తీక్ష్ణంగా చూస్తూంది. బాటరీ లైటు కాంతిలో ఆ కళ్ళు బహు క్రూరంగా ఉన్నాయి. చప్పున మాధవశర్మగారు ఇంట్లోకి వెళ్ళారు. మండుతున్న అగ్ని శిఖతో దాన్ని కొట్టారు.

"ఈశ్వర్ ఇది త్రిజట కనుక అయినట్టయితే. . .ఇప్పటికే రెండు ప్రదక్షిణాలు పూర్తి చేసింది. . .చాలా జటిలమైన పరిస్థితి. . రేపటి వరకు మనం చేసేదేమీ లేదు. . ." మాధవశర్మ గారు అన్నారు.

"బాబుగారూ ఏమిటిదంతా? ఎందుకీ కుక్క మా వారిపై పగ పట్టింది. . ." ఏడుస్తూ అడిగింది అక్క.

"అది కుక్క కాదమ్మా. పది పదిహేనేళ్ళ క్రితం మా ఇంటి వెనకాల ఒక బైరాగి ఉండేవాడు. పెద్ద పెద్ద బొట్లు, గడ్డాలు, చేతిలో త్రిశూలం చాలా భయంకరంగా ఉండేవాడు. వెక్కిలు మొలిచిన ఎర్రటి స్థలంలో ఒక గుడిసెలో ఉండేవాడు.

ఆ రోజుల్లో పిల్లలను అపహరించి, దూర ప్రాంతాల్లో బలులకు ఉపయోగించేవారని వినికిడి. అదే సమయంలో, ఈ దగ్గరలో అనంతమ్మ గూడెంలో కూడా కొంతమంది పిల్లలు కనపడకుండా పోయారు. బైరాగుల మీద, ముష్టివాళ్ళ మీదా ప్రజలకు అనుమానం ఉండేది. అదే సమయంలో ఈ బైరాగి ఊరికి దూరంగా ఇక్కడే ఉండేవాడు. ఒక రోజు ఈ బైరాగి పెద్ద సంచి భుజాన వేసుకుని వస్తూండగా నలుగురైదుగురు గ్రామస్థులు అతనిని అడ్డగించారు. సంచిలో నుంచి చిన్నగా మూలుగులు వినబడడంతో అనుమానం ఎక్కువైంది ప్రజలకు. పిల్లలను పోగొట్టుకున్న తండ్రులు తమ్ముళ్ళను, చెల్లాయిలను పోగొట్టుకున్న యువకులు పట్టరాని ఆవేశానికి లోనయ్యారు. ఆ సంచిలోని దేమిటని అడిగారు. 'కుక్క పిల్లలు' అని చెప్పాడు బైరాగి. 'కుక్కక్క పిల్లలా. .నిజంగా పిల్లలా. .' అని కర్రతో అతని తలపై ఒక దెబ్బ కొట్టాడు ఒక యువకుడు. 'అమ్మో' అని అడవి అంతా దద్దరిల్లేటట్టు అరచి పడిపోయాడు బైరాగి. మిగిలినవారు కూడా ఊరుకోలేదు. కసితో ప్రాణం పోయినా పొడిచారు.





బైసన్ నిట్టింగ్ కంపెనీ, తిరుప్పూరు-4.

TRADE MARK REGD No 240260

BISON

రోజుకు రోజూ నూతన
ఉత్సాహముతో ఉప్పొంగటానికి ధరించి
ఆనందించండి

బైసన్

IS:4964 బనియనులు,
జట్టీలు

వాని ఖచ్చితమైన అమర్పు - మీ శరీరాన్ని
అంటుకొని నూతన ఉత్సాహాన్ని
ఆనందాన్ని ఇస్తుంది.

మా విశేష తయారీ : డయానా బ్రీఫ్‌లు,
కూల్‌టెక్స్ బనియన్లు, ఫాన్సీ రకాలు

CHARI

సంచి తెరచి చూస్తే దాంట్లో నిజంగా కుక్క పిల్లలే. రోడ్డు మీద దిక్కుమొక్కు లేకుండా, చలితో గడగడలాడే కుక్క పిల్లలను ఏరుకొచ్చి తన గుడిసెలో పడుకోబెట్టుకునేవాడు ఆ బైరాగి. చేసిన పొరపాటుకు పశ్చాత్తాపపడి, ఆ స్థలంలోనే ఆ శవాన్ని వదిలి తమ దారిన పోయారు. ఆ బైరాగి రక్తం పడిన ఆ స్థలంలో ఏ మొక్కా మొలవలేదు. జీవకారుణ్యంతో, వైరాగ్యంతో బ్రతుకుతున్న ఆ బైరాగి ఆత్మ ప్రతీకారం కోసం కాచుకునుంది. కుక్క రూపంలో 'త్రిజట' పూర్తి చేయడానికి సంకల్పించి ఉంటుంది. ఆ రోజులలోనే నాకీ వార్త తెలిసింది. అయితే. . ."

మాధవశర్మగారు ఇంకా పూర్తి చేయకుండానే అడిగాను నేను—

"మరి ఈ త్రిజట మా బావను ఎందుకు బంధిస్తోంది.."

"బైరాగిని దాడి చేసిన వాళ్ళలో ఈయన కూడా ఉండి ఉండవచ్చు. . ."

"అక్కా! నీకేమైనా తెలుసా..?"

"ఊహూ. . ." తెలియదన్నట్టు తల ఊపింది అక్క.

● ● ● ●

మర్నాడు రాత్రి. . .హోమం జరుగుతూంది. . . బావలో మృత్యు ఛాయలు కనిపిస్తున్నాయి. ఇది రూఢిగా త్రిజటే. రెండు చుట్లు పూర్తి చేశాడు బైరాగి కుక్క రూపంలో. ఆ కుక్కను తుపాకితో కాల్చినా, రాయి పెట్టి కొట్టినా ప్రయోజనం ఉండదు.

పిల్లలకు కూడా తెలిసిపోయింది. వాళ్ళు కూడా ఏమీ తినకుండా చూస్తున్నారు—జరుగుతున్న హోమంకేసి, వాళ్ళ నాన్నకేసి.


"ఈ రోజు చాలా భయంకరమైన రోజు మూడవ ప్రదక్షిణ చేయనివ్వకుండా చూడాలి. ఇది అయిపోయిన తర్వాత, ఈ రోగిని ఈ ప్రదేశానికి దూరంగా తీసుకుపోవాలి. ఈ ఇంటి చాయలకు రాకూడదు. ఆ ఇంటి పడక గది పూర్తిగా మూసి వేయాలి." మాధవశర్మగారు హెచ్చరించారు.

గంభీరంగా ఆయన మంత్రోచ్చారణ చేస్తున్నారు. వీధి తలుపులు వేసి ఉంచాము. పొగ గది నిండా వ్యాపిస్తోంది. బయట గుర్. .గుర్. .అని చప్పుడు మొదలయింది.

మాకు తెలుసు అది ఏమయి ఉంటుందో!

ఆ కుక్క భయంకర రూపం, కళ్ళలో ఆ తీక్షణత, బయటకు వచ్చిన ఎర్రటి నాలుక, తెల్లటి కోరలు—తలుచుకుంటే, దాన్ని ప్రతీకార దీక్ష ఊహించుకుంటే ఒళ్ళు జలదరించింది. పడక కుర్చీలో పడుకున్న బావ కళ్ళలో హఠాత్తుగా జీవం వచ్చింది. ఏదో అలజడి బయలుదేరింది ఆయన శరీరంలో. బహుశా ఆ శక్తి ఈయనను లాగుతూందేమో! దిగ్గున లేచాడు!!

"ఆయనను బయటకు పోనీయవద్దు. . ." అరిచారు మాధవశర్మగారు. నేనూ, అక్కా ఆయనను కుర్చీకి అదిమి పట్టుకున్నాం.




మండుతున్న రెండు రావి కర్రలు నా చేతికి ఇచ్చారు మాధవశర్మగారు.

"ఈసారి గురి చూసి ఈ నిప్పు కర్రలను ఆ కుక్క మీదకి విసరండి" అన్నారు.

బాటరీ లైటు సాయంతో నేను బైటకొచ్చాను. అక్క ఒక్కర్తే బావను అదిమి పట్టుకుంది కుర్చీకి.

నేను ఇంటి వెనకవైపుకు వచ్చాను. గోడ మీద నుండి లైటు ఫోకస్ చేశాను. మొక్కలు తప్ప అక్కడ కుక్క లేదు. ఇంటి ఎడమ వైపున నల్లటి శరీరం అస్పష్టంగా కనిపించింది.

అయితే మూడవ జట పూర్తి చేయడానికి, ఏ శక్తులు ఇంటి మీద పని చేయకుండా చేయడానికి, బయలుదేరిందన్నమాట కుక్క.

కాలి పత్తువ కొద్దీ వెనక్కి పరుగెత్తాను. ఏవో తీగలు కాలికి తగిలాయి. అగ్ని ఖండాలు దూరంగా పడ్డాయి. మొక్కలలో ఎక్కడ పడ్డాయో తెలియదు.

లైటు వెలుగులో అంతా వెతికాను. కొంతసేపటికి దొరికాయి. అగ్గి ఆరిపోయింది. గిరుక్కున ఇంటి ముందుకొచ్చాను. అప్పుడు చూశాను—గేటు బయట కాదు—లోపల ఆ కుక్క. పూర్తి రూపం కనబడింది. నిలబడితే మూడడుగులు తక్కువ ఉండదు... నిగనిగ మెరిసే నల్లటి శరీరం. మొహం పై తెల్లటి మచ్చ. ఊపిరి పీలుస్తుంటే గుర్రుమనే శబ్దం. ప్రమాదం ముంచుకొచ్చింది. పిచ్చివాడిలా అరిచాను.

"అక్కా! లోపల కొచ్చేస్తోంది. . ."

కీచుగా అరుస్తూ కుక్క గుమ్మం ఎక్కుతూంది.

"అమ్మా. . .ఆయనను వదిలి బయటకు వెళ్ళకండి. పరుగెడతారేం. . .ఆయనను బయటకు వెళ్ళనివ్వకండి." మాధవశర్మగారు అరుస్తున్నారు.

అక్క భయంతో బయటికి వచ్చేసింది. ఆమె వెనక బావ. . .అస్థిపంజరంలా. . . పైజామా, లాల్చీలో ప్రేతాత్మలా. . .

● ● ●

మెట్ల మీద జారి పడింది అక్క. చేతినానించి కూర్చున్నాడు, విచార భంగిమలో బావ.

కీచుగా అరుస్తూ కుక్క బావపై నుంచి దూకి వెళ్ళింది.

దిగ్భ్రాంతిగా చూస్తూ బయటకు వచ్చారు మాధవశర్మగారు.

"ఉదయం అయితేగాని ఏ సంగతి చెప్పలేం." అన్నారు మాధవశర్మగారు.

అచేతనంగా పడి ఉన్నాడు బావ. ఆశ నిరాశల మధ్య భరించరాని మానసిక వేదన.

నిష్ఠ నియమాలతో ఏళ్ళ తరబడి చేసిన పవిత్ర గాయత్రీ జపం, హోమాలు, యజ్ఞాలు—వీటి బలం ఎక్కువో, లేక నీచమైన, భయంకరమైన, హీనమైన పగతో కూడిన క్షుద్ర శక్తి గొప్పదో!

పిల్లలిద్దరూ జోగుతున్నారు. అక్క ఒక మూలకు పరిగి కూర్చుంది. ఆమెలో జీవశక్తి ఉన్నదో, లేదో చెప్పలేం. చేతనా చేతన స్థితులే ప్రాణభరితమో, ప్రాణరహితమో నిర్ణయించేటట్టయితే ఆమెలో ఇప్పుడు ప్రాణం లేనట్టే!

అచేతనంగా ఉన్న బావని ఇంట్లో చేర్చాను. నాకు ఎవరూ సహాయం చేయలేదు. చేసే స్థితిలో లేరు.

వృద్ధులైన మాధవశర్మ కృద్ధులై ఉన్నారు. తన ప్రయత్నం—స్వార్థరహిత ప్రయత్నం ఫలిస్తుందా, లేదా? అనే ఆలోచనలో ఉన్నట్టున్నారు.

"పాపం చేస్తే శిక్ష అనుభవించవలసిందే. . ." మాధవశర్మగారు తనలో తను అనుకొంటున్నారు.

"అయ్యా! మా బావ చేసిన నేరం ఏమంత గొప్పదని. నలుగురితోబాటు ఒక దెబ్బ వేస్తే వేశాడేమో! ఈయన నేరం అంత క్షమించరానిదా? ఈయన ఒక్కడివల్లనే ఆ సాధువు ప్రాణం పోలేదుగా? ఈయన ఒక్కడికే ఎందుకు శిక్ష? ఈ పది రోజులుగా ఆయన, ఆయన కట్టుకున్న మా అక్క మేమందరమూ శిక్ష అనుభవించాము కదా!" అన్నాను నేను బాధగా.

"నేరమూ—శిక్షా తగు పాళ్ళలో ఉండడానికి ఇది మనిషి నిర్మించుకున్న న్యాయశాస్త్రమూ, శిక్షా స్మృతీ కాదు. ఇది ఇప్పుడు దైవ శక్తికి, క్షుద్రశక్తికీ మధ్య జరిగే సంఘర్షణ, గెలుపెవరిదో! రెండు బ్రహ్మాండమైన శక్తులు పోరాడేటప్పుడు కొంత మంది బలి కాక తప్పదు." మాధవశర్మగారు అన్నారు.

చీకట్లు విచ్చుకుంటున్నప్పుడు నేను బయటకు చూశాను. శునక రూపంలో ఉన్న మృత్యు దేవత ఇంటి ముందు ఉంటుందని నా భావన. దూరంగా ఎక్కడో కుక్క ఏడుపు.

మాధవశర్మగారు స్నానానికి లేచారు. అక్క అలాగే అచేతనంగానే ఉంది. ఆమెను లేపే సాహసం చేయలేదు నేను. తూర్పు తెల్లవారుతూండగా మాధవశర్మగారు గాయత్రీ జపం పూర్తి చేశారు.

ఒక డాక్టరు తన వృత్తి నైపుణ్యాన్నంతా వెచ్చించి ఒక ప్రాణిని రక్షించాలని ప్రయత్నిస్తాడు, ఆ డాక్టరుకు ఎన్నో ఆయుధాలు, మందులు, మనుషులు సహాయంగా. కాని, మాధవశర్మగారిది కనపడని పోరాటం! ఒంటరి పోరాటం!

సూర్యుడు కిటికీలో నుండి తీక్షణంగా చూస్తున్నాడు.

మాధవశర్మగారి వదనంలో దరహాసం తళుక్కుమంది. తూరుపున ప్రకాశిస్తున్న రవిబింబం కాంతిలో శర్మగారి ఫాల భాగం మీద విభూతి పుండ్రాల మధ్య కుంకుమ బొట్టు మెరిసింది.

పీడకల మధ్య మెలకువ వచ్చినట్టు బావ బిక్కు బిక్కుమని దిక్కులు పరికిస్తున్నాడు.

మాధవశర్మగారు హోమగుండం ముందు నిలబడి సగర్వంగా చూశారు. అక్క రెండు చేతులు జోడించి ఆయనకు నమస్కరించింది. ○